

ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు గరిష్ఠం: 43.5 । కనిష్ఠం: 27.0
ANDHRAJYOTHY
5

నాగర్‌కర్నూల్
జిల్లా వార్తలు
సోమవారం 22 ఏప్రిల్ 2024

మామిడిపై.. తెగుళ్ల దాడి


పూత రాలిపోవడంతో కాతలేని మామిడి చెట్లు

- పూత దశలో దాడి చేసిన తెగుళ్లు
- 50 శాతానికి తగ్గిన దిగుబడి
- నాగర్‌కర్నూల్ జిల్లా రైతులకు కోట్ల రూపాయల నష్టం
- కాయలకు ఫ్రూట్ ప్రొటెక్షన్ కవర్లు ఏర్పాటు చేయడంతో కొంత వరకు నివారణ

కొల్లాపూర్, ఏప్రిల్ 21: రాష్ట్రంలో మామిడి తోటలు అనగానే ముందుగా గుర్తొచ్చేది నాగర్‌కర్నూల్ జిల్లా. జిల్లాలో మామిడి రైతులు ఈ ఏడాది పూర్తిగా నష్టపోయారు. గతేడాది డిసెంబరు చివరి వారంలో, ఈ ఏడాది జనవరి మొదటి వారంలో యధావిధిగా మామిడి పూత వచ్చినా, నల్లతామర పురుగు, తేనే మంచు పురుగు దాడి చేయడంతో రైతులు కోట్ల రూపాయలు నష్టాలపాలయ్యారు. పూత పిందెగా మారక ముందే నల్లతామర పురుగు పీల్చి పిప్పి చేయడంతో పూత రాలిపోయి, కేవలం కాడలు మిగిలాయి. దీనికి ఉష్ణోగ్రతల మార్పు కూడా తోడైంది.

34 వేల ఎకరాల్లో తోటలు


మొదటి దశలో గతేడాది నవంబరు చివరి నుంచి డిసెంబరు రెండో వారంలో వచ్చిన పూత ఈ ఏడాది మార్చిలో కోతకు వచ్చాయి. రెండో దశలో ఈ ఏడాది జనవరి చివరిలో వచ్చిన పూత మే మొదటి, రెండో వారంలో దిగుబడి కోతకు రావాల్సి ఉంది. కానీ నల్లతామర పురుగు వల్ల పూత రాలి పిందె పడలేదని దీంతో 50 శాతం పంట దిగుబడి తగ్గిపోయిందని ఉద్యానవన శాఖ అధికారులు పేర్కొంటున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా 20 మండలాల్లో 34 వేల ఎకరాల్లో 14 వేల మందికిపైగా రైతులు మామిడి తోటలను సాగు చేస్తున్నారు. 60 వేల నుంచి 80 వేల మెట్రిక్ టన్నుల దిగుబడి రావాల్సి ఉండగా, ఈ ఏడాది కేవలం 30 వేల నుంచి 40 వేల మెట్రిక్ టన్నుల దిగుబడి మాత్రమే వచ్చేట్లు ఉందని అధికారులు అంటున్నారు. మామిడి తోటలపై నాలుగేళ్ల నుంచి నల్లతామర, తేనె మంచు పురుగులు దాడి చేస్తుండటంతో దిగుబడి పూర్తిగా తగ్గుతుందన్నారు. ఈ ఏడాది రైతులు ముందస్తు జాగ్రత్తగా కాయలకు ఫ్రూట్ ప్రొటెక్షన్ కవర్లు ఏర్పాటు చేయడంతో ఊహించని నష్టాన్ని రైతులు నివారించగలిగారన్నారు. నల్లతామరకు, తేనె మంచుకు ఇంకా మందులు కనుగొనకపోవడంతో మామిడి రైతులు రూ.లక్షలు పెట్టి పురుగు నివారణ మందులు పిచికారి చేసినా ఫలితం ఉండటం లేదు. దాంతో రైతులకు కోట్ల రూపాయల నష్టం వాటిల్లింది.

ధర అంతంతే..

ఈ ఏడాది దిగుబడి తక్కువగా ఉన్న మామిడికి మాత్రం డిమాండ్ కూడా అంతంత మాత్రంగానే ఉంది. హైదరాబాద్ బహిరంగ మార్కెట్‌లో కేజీ 40 నుండి 60 రూపాయల వరకు ధర పలుకుతుండటంతో మామిడి రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నాలుగు నెలల పాటు రూ.లక్షలు పెట్టుబడి పెట్టి దిగుబడిని విక్రయించుకునేందుకు హైదరాబాద్ ఫ్రూట్ మార్కెట్‌కు డీసీఎంలు, ట్రాక్టర్లు, ఆటోల్లో తీసుకెళ్తే కనీసం పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత్యంతరం లేక దళారులు సూచించిన ధరకే అమ్ముకోవాల్సిన పరిస్థితి ఉందని అంటున్నారు. కొల్లాపూర్‌లో మామిడి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామన్న హామీ అమలైతే తమ కష్టాలు, నష్టాలు కాస్తయినా తగ్గేవని రైతులు అంటున్నారు.


మామిడి కాయలకు ఏర్పాటు చేసిన ఫ్రూట్ ప్రొటెక్షన్ కవర్లను పరిశీలిస్తున్న అధికారి

ఈ ఏడాది మామిడి పోయింది


ఈ ఏడాది మామిడి దిగుబడి పోయింది. పూత రాగానే నల్లతామర పురుగు, తేనె మంచు పూతపై దాడి చేయడంతో రైతులు నష్టపోయారు. నేను 25 ఎకరాల్లో మామిడి తోటను సాగు చేస్తున్నా. ఈ ఏడాది నాలుగు లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టగా.. 25 వేల రూపాయల పంట కూడా చేతికి రాలేదు. నాలుగేళ్ల నుంచి మామిడి రైతుల పరిస్థితి ఘోరంగా మారింది. నల్లతామర పురుగుకు శాస్త్రవేత్తలు మందు కనుగొనే వరకు మేం నష్టపోవాల్సిందే.

- పెబ్బేటి కృష్ణయ్య, మామిడి రైతు, సింగిల్ విండో చైర్మన్, కొల్లాపూర్

అప్పులే మిగిలాయి


ఈ ఏడాది మామిడి రైతులంతా అప్పుల పాలు కావాల్సిందే. విపరీతంగా పూత పూసినా.. నల్లతామర పురుగు, బంక, తేనె మంచు, మంగు తెగుళ్లు సోకడంతో పిందె దశలోనే పూత రాలిపోయింది. తెగుళ్ల నివారణకు వేల రూపాయలు పెట్టి మందు పిచికారి చేసినా ఫలితం లేదు. నష్టపోయిన మామిడి రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి.

- పిల్లి శివయ్య, మామిడి రైతు, దేవునితిర్మలాపూర్

తెగుళ్లతో తగ్గిన దిగుబడి


ఈ ఏడాది తెలంగాణ రాష్ట్రంలోనే కాకుండా ఆంధ్రాలోని చిత్తూరు, కడప, జగిత్యాలతోపాటు పక్క రాష్ట్రమైన కర్ణాటకలో కూడా మామిడి దిగుబడి తగ్గింది. వాతావరణంలో మారిన ఉష్ణోగ్రతలతోపాటు నల్లతామర, తేనె మంచు తెగుళ్లు దిగుబడిని నాశనం చేశాయి. ఈ ఏడాది నాగర్‌కర్నూల్ జిల్లాలో 30 వేల నుంచి 40 వేల మెట్రిక్ టన్నుల దిగుబడి మాత్రమే వచ్చేలా ఉంది. రైతులకు ఎప్పటికప్పుడు జాగ్రత్తలు, సూచనలు చేస్తున్నాం.

- లక్ష్మణ్, హార్టికల్చర్ అధికారి


బిజినేపల్లిలో సీఎం సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

అధినేతల తాకిడి

- నామినేషన్ల ఘట్టం ముగియక ముందే ప్రధాన పార్టీల ప్రచార హోరు
- రేపు సీఎం రేవంత్, 25న గుజరాత్ ముఖ్యమంత్రి రాక
- 27న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రోడ్‌షో

నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల నామినేషన్ల ఘట్టం ముగియక ముందే నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులు ప్రచారం హోరెత్తిస్తున్నారు. ఈ నియోజకవర్గంలో కాంగ్రెస్ నుంచి మల్లు రవి, బీజేపీ నుంచి పి.భరత్ ప్రసాద్, బీఆర్ఎస్ నుంచి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ నామినేషన్లు దాఖలు చేసిన విషయం తెలిసిందే. బహుజన సమాజ్ పార్టీ నుంచి అనూహ్యంగా మాజీ ఎంపీ మందా జగన్నాథ్ రంగంలోకి దిగడంతో పోటీ ఆసక్తికరంగా మారింది. మాయవతి నుంచి బీఫామ్ అందుకున్న జగన్నాథ్ ఇంకా నామినేషన్ దాఖలు చేయలేదు. శనివారం భారీ ర్యాలీతో నాగర్‌కర్నూల్‌కు చేరుకున్న ఆయన.. ఆత్మగౌరవ నినాదంతోనే తాను ఎన్నికల బరిలో దిగుతున్నట్లు ప్రకటించారు.

జోరందుకున్న ప్రచారం

అభ్యర్థులు మల్లు రవి, పోతుగంటి భరత్‌ప్రసాద్, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పార్లమెంట్ నియోజకవర్గంలో కలియతిరుగుతూ ప్రచారం జోరు పెంచారు. ఇప్పటికే ఒకమారు పార్లమెంట్ నియోజకవర్గమంతా చుట్టి వచ్చిన ఈ ముగ్గురు నాయకులు పార్టీల స్టార్ క్యాంపెయినర్లను రంగంలోకి దించుతున్నారు. అందులో భాగంగా కాంగ్రెస్ అభ్యర్థి మల్లురవికి మద్దతుగా మంగళవారం బిజినేపల్లిలో జరిగే ఎన్నికల ప్రచార సభకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి హాజరు కానున్నారు. ఈ సభను జయప్రదం చేసేందుకు మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి, జిల్లా ఎమ్మెల్యేలు కశిరెడ్డి నారాయణరెడ్డి, చిక్కుడు వంశీకృష్ణ, కూచకుళ్ల రాజేష్‌రెడ్డి అధికంగా జన సమీకరణ కోసం ప్రయత్నాలు ప్రారంభించారు. మరోవైపు బీజేపీ కూడా కాంగ్రెస్‌కు సమాన స్థాయిలో రోడ్‌షో నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. ఈ నెల 25న గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర బాయి పటేల్‌తో రోడ్‌షో నిర్వహించ తలపెట్టింది. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఎంపీ పోతుగంటి రాములు, జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు, దిలీపాచారి, జక్కా రఘునందన్‌రెడ్డి తమ వంతు ప్రయత్నాలను ప్రారంభించారు. మరోవైపు బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పర్యటన కూడా ఖరారైంది. ఈ నెల 27న ఆ పార్టీ అభ్యర్థి ప్రవీణ్‌కుమార్‌కు మద్దతుగా కేసీఆర్ నాగర్‌కర్నూల్‌లో రోడ్‌షో నిర్వహించనున్నారు. కేవలం నాలుగు రోజుల వ్యవధిలో తెలంగాణ, గుజరాత్ ముఖ్యమంత్రుల జిల్లా పర్యటనలు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రోడ్‌షో ఉన్న నేపథ్యంలో బందోబస్తు ఏర్పాట్లకు జిల్లా పోలీసులు శ్రమిస్తున్నారు.

రేపు మద్దూర్‌కు సీఎం

మద్దూర్: రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్‌రెడ్డి నారాయణపేట జిల్లా మద్దూర్ మండలంలో ఈ నెల 23న పర్యటించనున్నారు. మద్దూర్‌లోని గ్రీన్ ప్యాలెస్‌లో ఉదయం 11 గంటలకు జరిగే పార్టీ కార్యకర్తల సమావేశంలో పాల్గొనన్నుట్లు నాయకులు తెలిపారు. కొత్తపల్లి మండలం తిమ్మారెడ్డిపల్లిలో జరుగుతున్న బావోజీ బ్రహ్మోత్సవాల సందర్భంగా మధ్యాహ్నం ఒంటి గంటకు స్వామిని దర్శించుకుంటారని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. సీఎం పర్యటన నేపథ్యంలో ఎస్పీ యోగేశ్‌గౌతమ్ మద్దూర్‌లోని గ్రీన్ ప్యాలెస్‌ను, హెలిప్యాడ్ స్థలాన్ని, తిమ్మారెడ్డిపల్లిలోని బావోజీ ఆలయాన్ని పరిశీలించారు. పోలీసులకు పలు సూచనలు చేశారు.

సోనియాగాంధీ రుణం తీర్చుకుందాం

- మంత్రి జూపల్లి కృష్ణారావు


పెంట్లవెల్లిలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

పెంట్లవెల్లి, ఏప్రిల్ 21 : తెలంగాణలో పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధిక సీట్లు సాధించి తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీ రుణం తీర్చుకుందామని ఎక్సైజ్, పర్యాటక, టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని చాణిక్య స్కూల్ ఆవరణలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాహుల్‌గాంధీని ప్రధాని చేయడమే లక్ష్యంగా తెలంగాణలో అత్యధిక పార్లమెంట్ స్థానాలు సాధించి సోనియా గాంధీకి కానుకగా ఇవ్వాలని వారు పేర్కొన్నారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కలిసికట్టుగా కృషి చేయాలని వారన్నారు. కార్యకర్తలకు ప్రజలకు ఏమైనా సమస్యలు ఉంటే కొల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విన్నవించాలని వెంటనే పరిష్కరిస్తున్నామని వారు పేర్కొన్నారు. అదేవిధంగా అసెంబ్లీ ఎన్నికల్లో పెంట్లవెల్లి మండలంలో కాంగ్రెస్ పార్టీకి మెజార్టీ తక్కువ రావడంపై కార్యకర్తలతో చర్చించారు. అదేవిధంగా కొల్లాపూర్ నియోజకవర్గంలో 3500మంది లబ్ధిదారులకు డబుల్‌బెడ్రూం ఇళ్లు మంజూరు చేస్తామని అన్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రామన్‌గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నరసింహయాదవ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నరసింహనాయుడు, కాంగ్రెస్ నాయకులు కబీర్, ఎర్రశ్రీను, కుమార్, గుడమోని రవి, ఖాజామైనోద్దీన్, ఆసీఫ్, ధర్మతేజ, బాలస్వామి పాల్గొన్నారు.

కందనూలుపై కాషాయ జెండా ఎగురేస్తాం

-ఎంపీ పోతుగంటి రాములు


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ రాములు

నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): దేశంలో చారిత్రాత్మక సంస్కరణలకు స్వీకారం చుట్టిన నరేంద్రమోదీ మూడవసారి ప్రధాన మంత్రి కావడం తథ్యమని నాగర్‌కర్నూల్ ఎంపీ పోతుగంటి రాములు అన్నారు. కందనూలు గడ్డపై పార్లమెంట్ ఎన్నికల్లో కాషాయం జెండా ఎగురవేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఆదివారం సాయంత్రం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్.దిలీపాచారితో కలిసి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను కూడా ఏర్పాటు చేయాలని ప్రధాని నరేంద్రమోడీని కోరినట్లు ఆయన ఈ సందర్భంగా చెప్పారు. రాష్ట్ర అధికార ప్రతినిధి దిలీపాచారి మాట్లాడుతూ ఎంపీ రాములు కుమారుడు భరత్‌ప్రసాద్‌ను గెలిపిస్తే నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గానికి మహర్దశ పడుతుందని చెప్పారు. విలేకర్ల సమావేశంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బుసిరెడ్డి సుధాకర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజావర్ధన్‌రెడ్డి, బచ్చిరెడ్డి, లోహిత్‌రెడ్డి, యాదగిరిరావు, ఎలిమే రాములు పాల్గొన్నారు.

జోగుళాంబదేవి ఆలయంలో నాగర్‌కర్నూలు జిల్లా న్యాయాధికారి పూజలు


అలంపూర్ ఆలయంలో న్యాయాధికారి రాజేష్‌బాబుకు స్వాగతం పలుకుతున్న ఆలయ అర్చకులు

అలంపూర్, ఏప్రిల్ 21: ఐదవ శక్తి పీఠం అలంపూర్ జోగుళాంబ దేవి, బాలబ్రహ్మేశ్వర స్వామి వార్లను నాగర్‌కర్నూల్ జిల్లా న్యాయాధికారి డి.రాజేష్ బాబు సతీసమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు స్వాగతం పలకగా స్వామి వారి ఆలయంలో అభిషేక పూజలు, స్పర్శ దర్శనం, అమ్మవారి ఆలయంలో అర్చనలు వంటి విశేష పూజలను చేసి శాలువా పూలమాలతో సత్కరించి తీర్థ ప్రసాదాలను అందించారు. కార్యక్రమంలో అలంపూర్ పట్టణ సివిల్ కోర్టు న్యాయాధికారి కమలాపురం కవిత, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.


రథోత్సవంలో పాల్గొన్న అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ


రథోత్సవం అనంతరం గుట్టపై నుంచి కిందకు వస్తున్న భక్తులు


అశేష జనవాహిని మధ్య రథాన్ని లాగుతున్న భక్తులు

వైభవంగా పెద్ద రథం

- భక్తులతో కిక్కిరిసిన సిర్సనగండ్ల
- ఘనంగా కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

చారకొండ, ఏప్రిల్ 21: రాష్ట్రంలో రెండో అపర భద్రాద్రిగా పేరుగాంచిన నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండలం సిర్సనగండ్ల సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఆదివారం తెల్లవారుజామున వేలాది మంది భక్తుల మధ్య పెద్ద రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ కొబ్బరికాయ కొట్టి రథోత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా భక్తులు జైశ్రీరాం అని నినదిస్తూ రథాన్ని లాగారు. ఎత్తయిన బండల మీదుగా శివాలయం, ముక్కిడి పోచమ్మ, దత్తాత్రేయ మందిరం, రామకోటిస్తూపం సమీపాల నుంచి ఆలయం వరకు రథాన్ని లాగారు. ఆలయ పూజారులు ఉత్సవ విగ్రహాలను ఆలయం ముఖద్వారం గుండా గర్భగుడిలోకి తీసుకెళ్లారు. ఆలయ సమీపంలోని ముక్కిడి పోచమ్మ, ఆలయం దిగువనున్న మైసమ్మ ఆలయాల్లో భక్తులు నైవేద్యం సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. రామాలయం పడమర దిక్కున ఉన్న గుట్టపై గండదీపం వెలిగించడంతో భక్తులు అక్కడికి కాలి నడకన వెళ్లి పూజలు చేశారు. రథోత్సవం అనంతరం భక్తులు మెట్ల దారి వెంట గుట్ట కిందికి వచ్చి, జాతరలో తినుబండారాలు, మహిళలు అలంకరణ సామగ్రి, పిల్లలు ఆటబొమ్మలు కొనుగోలు చేశారు. కల్వకుర్తి డీఎస్పీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో వెల్దండ సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎస్ఐ రాజశేఖర్ సమక్షంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ డేరం రామశర్మ, ఈవో మల్లెల రఘు, బ్లాక్ కాంగ్రెస్ అచ్చంపేట అధ్యక్షుడు గుండె వెంకట్‌గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జమ్మికింది బాల్‌రాంగౌడ్, మండల యూత్ అధ్యక్షుడు గణేష్‌గౌడ్, సందీప్‌రెడ్డి, జైపాల్, లక్ష్మయ్యగౌడ్, ఆలయ మేనేజర్ నిరంజన్ పాల్గొన్నారు.

టీఎస్ఆర్‌జేసీ ప్రవేశ పరీక్ష ప్రశాంతం

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 85.04 శాతం మంది హాజరు


మహబూబ్‌నగర్‌లో ఓ పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఏప్రిల్ 21: రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలల్లో ప్రవేశాల కోసం ఆదివారం నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఉమ్మడి జిల్లాకు సంబంధించి మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో 49 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పరీక్ష కొనసాగింది. 11,665 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకావల్సి ఉండగా.. 9,920 మంది హాజరయ్యారు. 1,745 మంది గైర్హాజరు అయ్యారు. అంటే 85.04 శాతం మంది విద్యార్థులు హాజరు శాతం నమోదైంది. విద్యార్థులు గంట ముందే కేంద్రాలకు చేరుకున్నారు. వారి తల్లిదండ్రులు, బంధువుల రాకతో కేంద్రాల వద్ద సందడి నెలకొంది. పరీక్ష కేంద్రాలను డీఈవో రవీందర్, అధికారులు పర్యవేక్షించారు.

అటు పెళ్లిళ్లు.. ఇటు ఎండలు

- అడ్డాకులలో 43.5 డిగ్రీల ఉష్ణోగ్రత

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 21 : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రస్తుతం ఎటు చూసిన పెళ్ళిళ్ళు, పుట్టుచీర వేడుకలు, గృహ ప్రవేశాలు తదితర శుభకార్యాలు జోరుగా సాగుతున్నాయి. కానీ ఎండలు తీవ్రంగా ఉండటంతో కొందరు ఏదో ఒక కారణం చెప్పి గైర్హాజరవుతున్నారు. తప్పనిసరిగా వెళ్లాల్సిన శుభకార్యాలకు ఇబ్బంది పడుతూనే హాజరవుతున్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలోని అడ్డాకులలో ఆదివారం అత్యధికంగా 43.5 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. జిల్లా వ్యాప్తంగా ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో పాటు వడగాలులు వీస్తుండటంతో ప్రధానంగా ద్విచక్రవాహనాలు నడిపేవారు చాలా ఇబ్బంది పడుతున్నారు. బాలనగర్‌లో 42.7, కోయిలకొండలో 42.3, మూసాపేటలో 42.2, మిడ్జిల్‌లో 41.9, మహబూబ్‌నగర్‌లో 41.5, జడ్చర్లలో 41.3 డిగ్రీలు నమోదు కాగా, నవాబ్‌పేటలో అత్యల్పంగా 39.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

నాగర్‌కర్నూల్ జిల్లాలో ఆదివారం అత్యధికంగా కల్వకుర్తిలో 40.0, కోడేరులో 39.3, అచ్చంపేటలో 39.0, తిమ్మాజిపేటలో 38.8, వంగూరులో 38.7, ఉప్పునుంతలలో 38.5, నాగర్‌కర్నూల్‌లో 38.3, పెద్దకొత్తపల్లిలో 38.2, చారకొండలో 38.0, కొల్లాపూర్‌లో 37.9, లింగాలో 36.1 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

నారాయణపేట జిల్లా వ్యాప్తంగా ఆదివారం కాస్తా తగ్గి వాతావరణం మేఘావృతం అయ్యింది. కానీ ఉక్కబోత ఉండటంతో జనం ఇబ్బంది పడ్డారు. ఉష్ణోగ్రత 39 డిగ్రీలుగా గరిష్ఠంగా నమోదు కాగా, కనిష్ఠంగా 27 డిగ్రీలు ఉంది. దీంతో ఉక్కబోతతో జనం ఉక్కిరి బిక్కిరి అయ్యారు. కోస్గీ మండలంలో 38 డిగ్రీలు, మక్తల్‌లో 39 డిగ్రీలు, నర్వలో 39 డిగ్రీలు, కృష్ణలో 39 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

వనపర్తి జిల్లాలోని కొత్తకోటలో గరిష్ఠం 39.8, కనిష్ఠం 24.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయ్యింది. అమరచింతలో 36.9 డిగ్రీలుగా నమోదయ్యింది. కనిష్ఠం 25.5 డిగ్రీలుగా ఉంది.

జోగుళాంబ గద్వాల జిల్లాలో శనివారం ఉష్ణోగ్రత కొంత తగ్గి చల్లని గాలులు వీచాయి. ఒక్క రోజు తేడాలోనే ఆదివారం మళ్లీ ఎండ దంచికొట్టింది. దంచికొట్టాయి. ఇటిక్యాలలో 38.8, గద్వాలలో 38.5, వడ్డేపల్లిలో 38.3, అయిజలో 38.1, అలంపూర్, ఉండవెల్లి, కేటీదొడ్డి, ధరూర్‌లో 38, మానవపాడులో 37.6,మల్దకల్ 37.5, గట్టులో 36.3డిగ్రీలు నమోదు అయ్యింది. కనిష్ఠ ఉష్ణోగ్రతలు 26,27డిగ్రీల మధ్య నమోదు అయ్యింది.

కుక్కల దాడిలో లేగదూడ మృతి

ఊర్కొండ, ఏప్రిల్ 21: కుక్కల దాడిలో లేగ దూడ మృతి చెందిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలంలోని తిమ్మన్నపల్లిలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. బాధిత రైతు సల్వాది చిన్న బాలయ్య తెలిపిన వివారాల ప్రకారం. తిమ్మన్నపల్లి శివారులోని తన స్వంత భూమిలో పాడి ఆవులతో పాటు లేగా దూడలను షెడ్డులో ఉంచి ఇంటికి రావడం జరిగిందని అన్నారు. ఆదివారం తెల్లవారుజామున పాలు తీయడానికి వెళ్లి చూడగా లేగ దూడ మృతి చెందిందని కుక్కలు అక్కడి నుంచి పారిపోయాయని తెలిపారు. గత పదిహేను రోజుల క్రితం ఇలాగే జరిగిందని, కుక్కల వల్ల పాడి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి కుక్కల బెడద నుంచి కాపాడాలని కోరారు.

వట్టెం వెంకన్నను దర్శించుకున్న ఎమ్మెల్యే దంపతులు



వట్టెం వెంకన్న ఆలయంలో వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి దంపతులను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

బిజినేపల్లి, ఏప్రిల్ 21 : నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని వట్టెంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి దంపతులు వెంకన్న స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యేగా విజయం సాధించాలని కోరిన కోరిక నెరవేరడంతో మొక్కు తీర్చుకునేందుకు వచ్చిన ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి దంపతులను ఆలయ ప్రధాన అర్చకులు ప్రసాదాచార్యులు, దేవస్థానం మేనేజర్ శ్రీనివాసులు స్వాగతం పలికి ఆలయ మర్యాదలతో సన్మాంచి తీర్థప్రసాదాలు అందజేశారు.

మద్దిమడుగులో ఘనంగా హనుమాన్ జయంతి ఉత్సవాలు ప్రారంభం

అమ్రాబాద్ ఏప్రిల్ 21: నాగర్‌కర్నూల్ జిల్లా పదర మండల పరిధిలోని మద్దిమడుగు ఆలయంలో హనుమాన్ జయంతి ఉత్సవాలు ఆలయ కార్యనిర్వాహణాధికారి రంగాచారి ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా ప్రారంభమైనాయి. ఈ సందర్భంగా ఆలయంలో యాగశాల ప్రవేశం, గణపతి పూజ, అగ్ని ప్రతిష్ఠాపన, ధ్వజారోహణం, రాత్రి 8 గంటలకు అశ్వవాహన సేవ, పార్వతీ పరమేశ్వరుల కల్యాణం తదితర కార్యక్రమాలను వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కొంతమంది హనుమాన్ దీక్ష చేపట్టిన స్వాములతో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. నల్లమల ప్రాంతంలో ప్రసిద్ధిగాంచిన సలేశ్వరం లింగమయ్య స్వామిని దర్శించుకున్న భక్తులు తిరుగు ప్రయాణంలో మద్దిమడుగు ఆంజనేయ స్వామిని దర్శించుకుని తమ మొక్కుబడులను తీర్చుకుంటారు. హనుమాన్ జయంతి ఉత్సవాలు మరో రెండు రోజుల పాటు కొనసాగుతాయి.

రామస్వామి ఆశయ సాధనకు కృషి చేయాలి

- తెలంగాణ సాహితీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.ఆనందాచారి



అవార్డు అందుకుంటున్న డిమ్కి కథల రచయిత్రి స్ఫూర్తి కందివనం

కందనూలు, ఏప్రిల్ 21 : సమసమాజం కోసం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో పాల్గొని కమ్యూనిస్టుగా తన జీవితాంతం కొనసాగిన కందికొండ రామస్వామి ఆశయాన్ని ఆయన స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లాలని తెలంగాణ సాహితీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే ఆనందాచారి అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని సింగిల్ విండో సమావేశపు హాల్‌లో నెలపొడుపు సాహిత్య సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కందికొండ రామస్వామి స్మారక జాతీయ పురస్కారం అవార్డు సభ వనపట్ల సుబ్బయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సభలో ఆనందచారి కందికొండ రామస్వామి స్మారక పురస్కారానికి ఎంపికైన డిమ్కి కథల రచయిత్రి స్ఫూర్తి కందివనంకు అవార్డు ప్రదానం చేశారు. ఈ అవార్డు కింద పదివేల నగదు బహుమతి, శాలువా, మెమోంటో, ప్రశంసా పత్రం ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. అంతకుముందు కందికొండ రామస్వామి చిత్ర పటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు హెచ్.ఆనంద్‌జీ, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మల్లురవి హాజరై మాట్లాడారు. అభ్యుదయ విలువలు, చిత్తశుద్ధితో సమసమాజ సాధన కోసం కమ్యూనిస్టుగా తన జీవితాంతం కొనసాగించాడని ఆయన అందరికీ ఆదర్శనీయుడన్నారు. రామస్వామి జీవితం ప్రజా పోరాటాలు, త్యాగాలతో కూడుకున్నదన్నారు. కార్మికులు, కర్షకులు, ప్రజల సమానత్వ ఆశయాలకనుగుణంగానే ఈ డిమ్కి కథలు రచించారన్నారు. రామస్వామి ఆశయ స్ఫూర్తితో మరిన్ని రచనలతో ముందుకెళ్లాలని అయన అభినందించారు. డిమ్కి కథలను అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పెబ్బేటి మల్లికార్జున్ పుస్తకాన్ని సమీక్షించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్.శ్రీనివాసులు, ఐద్వా అధ్యక్షురాలు కందికొండ గీత, మార్కిస్టు ఉపాధ్యాయులు అబ్దుల్లాఖాన్, కవి సామాజిక ఉద్యమకారులు ఎదిరేపల్లి కాశన్న, డి.రాములు, కల్వకోల్ మద్దిలేటి, గౌస్‌పాష, ముచ్చర్ల దినకర్, బోనాసి తిరుపతయ్య, మహమ్మద్ ఖాజా పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర బండలాగుడు పోటీలకు అపూర్వ స్పందన



పోటీలను ప్రారంభిస్తున్న నిర్వాహకులు

లింగాల, ఏప్రిల్ 21: కోదండరామస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాగర్‌కర్నూల్ జిల్లా లింగాలలో ఆదివారం నిర్వహించిన బండలాగుడు పోటీలకు గ్రామీణ రైతులు, ప్రజల నుంచి అపూర్వస్పందన లభించింది. పశుబల ప్రదర్శనకు గాను వివిధ ప్రాంతాల నుంచి అత్యాధిక సంఖ్యలో 17 జతల ఎద్దులు పాల్గొన్నాయి. ఈ పోటీలను సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు కొండల్‌రావు లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజల్లో ఉత్సాహాన్ని నింపేందుకు వ్యవసాయ రంగానికి ప్రాధాన్యతనిస్తూ పశు సంపదను పెంపొందించేందుకు ఈ పోటీలు ఎంతగానో దోహదపడుతాయని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కనుమరుగవుతున్న ఈ పోటీలను వివిధ సందర్భాలలో నిర్వహిస్తూ పూర్వవైభవాన్ని గుర్తించుకునే విధంగా పోటీలను నిర్వహించడం శుభపరిణామమని అన్నారు. ఎంతో ఉల్లాసంగా, ఉత్సాహంగా జరిగిన ఈ బండలాగుడు పోటీలను తిలకించడానికి పెద్ద సంఖ్యలో వివిధ గ్రామాలకు చెందిన రైతులు ఆసక్తి కనపర్చడంతో మైదానం కిక్కిరిసిపోయింది. మైదానంలో ఎద్దుల జతలు చూపిన విన్యాసాలు అందరిని ఆకట్టుకున్నాయి. రాత్రి జరిగిన బహుమతుల ప్రదానోత్సవంలో మొదటి బహుమతి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నంద్యాలకు చెందిన గోవర్ధనరెడ్డికి చెందిన ఎద్దులు రూ.45,000ను గెలుపొందాయి. గద్వాలకు చెందిన జానకిరాముడుకు చెందిన ఎద్దుల జతలు రెండవ బహుమతి రూ.35,000 గెలుపొందాయి. కర్నూల్ జిల్లా ఎనుగొవడ సురేష్‌కు చెందిన ఎద్దులు మూడవ బహుమతి రూ.25000 గెలుపొందాయి. గద్వాల జిల్లాకు చెందిన రసీద్‌పాష, రమేష్‌లకు చెందిన ఎద్దుల జతలు నాల్గో బహుమతి రూ. 15000 గెలుపొందాయి, నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండలం ధారారం గ్రామానికి చెందిన చంటికి చెందిన ఎద్దుల జతలు ఐదవ బహుమతి రూ. 10000 కైవసం చేసుకున్నాయి. కార్యక్రమంలో గిరిజన ఉద్యోగ సంఘం తాలూకా అధ్యక్షుడు శంకర్‌రాథోడ్, సింగిల్ విండో మాజీ ఉపాధ్యక్షుడు లక్ష్మీనాయక్, మాజీ వైస్‌ఎంపీపీ కిషన్‌నాయక్, ఆలయ కమిటీ అధ్యక్షుడు పూజారి భాస్కర్, నాయకులు పూజారి వెంకటయ్య, జ్ఞానేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.



మైదానంలో బండను లాగుతున్న ఎద్దులు

మార్వటాకులతో ఉపాధి

- నల్లమలవాసుల అభివృద్ధి దిశగా అటవీశాఖ చర్యలు
- సలేశ్వరం జాతరలో వాడేందుకు విస్తరాకుల ప్లేట్లు, ప్రసాదం కప్పుల తయారీ
- మన్ననూరు చెక్‌పోస్టు వద్ద కేంద్రం
- ప్లాస్టిక్ రహిత నల్లమలగా తీర్చిదిద్దేందుకు అటవీ అధికారుల యత్నాలు



పర్యావరణ హిత ప్లేట్ల యంత్రం పనితీరును పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

మన్ననూర్, ఏప్రిల్ 21 : అమ్రాబాద్ పులుల అభయారణ్యంలో ప్లాస్టిక్ లేని ఉత్పత్తులను వాడేందుకు అటవీశాఖ వడివడిగా అడుగులు వేస్తోంది. ఇది వరకే నల్లమలలో ప్లాస్టిక్ నిషేధానికి పలురకాల కార్యక్రమాలను నల్లమల ప్రాంతంలో అటవీ అధికారులు చేపడుతున్నారు. నల్లమలలో సీజనల్ వారీగా లభించే మార్వటాకులతో చెంచులతో పాటు స్థానింగా ఉండే ఇతర వర్గాల వారికి శాశ్వతంగా ఉపాధి అవకాశాలు కల్పించేందుకు మన్ననూరు చెక్‌పోస్టు ఆవరణలో కాటన్లు, విస్తరాకుల కుట్టు మిషన్ ద్వారా విస్తరాకుల తయారీని ప్రారంభించారు. నల్లమల మీదుగా శ్రీశైలం పుణ్యక్షేత్రానికి వెళ్లే భక్తులు ప్లాస్టిక్‌తో తయారైన వాటర్‌బాటిళ్లు, ఇతరత్రా ప్లాస్టిక్ వస్తువులను అటవీ ప్రాంతంలో ఎక్కడపడితే అక్కడ పారేస్తూ ఉండడంతో టన్నుల కొలదీ ప్లాస్టిక్ వ్యర్థాలు నల్లమల అభయారణ్య రహదారులపై పడుతున్నాయి. అంతేకాకుండా ప్రతీయేటా చైత్ర పౌర్ణమికి నల్లమల లోని లింగమయ్య జలపాతాల సందర్శనకు, అటవీ శాఖ మూడురోజులు అనుమతినిచ్చే సలేశ్వరం జాతర లో ట్రాక్టర్ల కొలదీ ప్లాస్టిక్ వ్యర్థాలు అటవీపాలవుతూ ఉన్నాయి. అభయారణ్యంలో ప్లాస్టిక్ కవర్లను భుజించే వన్యప్రాణులు కాన్సర్‌తో పాటు ఇతర జీర్ణకోశ వ్యాధులతో బాధపడుతూ మృత్యువాత పడే ఆస్కారముందని అటవీ అధికారులు గుర్తించారు. ఇదే క్రమంలో అమ్రాబాద్, పదర మండలాల్లోని మన్ననూరు, వెంకటేశ్వర్లబావి, వటవర్లపల్లి, దోమలపెంట, అమ్రాబాద్, తుర్కపల్లి, మద్దిమడుగు, పదర తదితర గ్రామాల్లో ఇంట్లో ఉండే గృహిణులు నల్లమలలో లభించే మార్వటాకులతో విస్తరాకులను చేతితో కుడుతూ ఉపాధి పొందుతున్నారు. ఈ ప్రాంతంలోని కూలీలు అడవిలో చైత్ర మాసం నుంచి డిసెంబర్ వరకు లభించే మార్వటాకులను సేకరించి విస్తరాకులు కుట్టే గృహిణులకు విక్రయిస్తూ ఉపాధి పొందుతున్నారు. మానవ తప్పిదాల కారణంగా ఇటీవలి కాలంలో అడవుల్లో అగ్ని ప్రమాదాలు చోటుచేసుకుంటూ ఉంటుండడంతో అటవీ అధికారులు మార్వటాకుల సేకరణకు కూలీలను అనుమతించడం లేదు. తరతరాలుగా తాము అడవులను నమ్ముకొని అటవీ ఫలసాయాలను సేకరిస్తూ జీవనం సాగిస్తుంటే అటవీ అధికారులు అడ్డుపడడం తగదని పలు సందర్భాల్లో అటవీ అధికారులతో స్థానిక కూలీలు తగాదాలు చేస్తూ ఉన్నారు. అడవులకు, వన్యప్రాణులకు నష్టం జరుగకుండా జాగ్రత్తలు వహిస్తూనే అడవిలో లభించే ఉత్పత్తులతో శాశ్వత ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతోనే తాజాగా విస్తరాకుల ప్లేట్లను తయారు చేసేందుకు అటవీశాఖ శ్రీకారం చుట్టింది. ఈ ప్రాజెక్టు విజయవంతమైతే నల్లమల వాసులకు మార్వటాకులతో చిరు కుటీర పరిశ్రమగా ఉపాధి పొందే అవకాశాలు మెరుగుపడతాయి. కేంద్రంలో నల్లమల ప్రాంతానికే చెందిన చెంచు మహిళలకు విస్తరాకులు కట్టే యంత్రాల ఆపరేటింగ్‌పై తర్ఫీదునిచ్చి వారితో ప్లేట్ల తయారీ చేపడుతున్నారు.



తయారైన మార్వటాకుల ప్లేట్లు

పట్టణాల్లో నల్లమల మార్వటాకులకు ఆదరణ

చాలాకాలం నుంచి నల్లమలలో లభించే విస్తరాకులకు ఎంతో ప్రాధాన్యత ఉంది. నల్లమలలో లభించే మార్వటాకులను హైదరాబాద్, బెంగుళూరు, విజయవాడ తదితర నగరాల నుంచి వర్తకులు నల్లమలకు వచ్చి గృహిణులు ఇళ్లలో కుట్టిన విస్తరాకుల కట్టలను కొనుగోలు చేసే తీసుకెళ్లే వారు. ప్లాస్టిక్ ప్లేట్లు వచ్చాక వీటి డిమాండ్ మధ్యలో తగ్గిపోయింది. ప్లాసిక్ ప్లేట్లలో భోజనం చేయడం శ్రేయస్కరం కాదని, కాన్సర్ వంటి ప్రమాదకర జబ్బులకు దారి తీస్తుందని గుర్తించి మళ్లీ మార్వటాకుల వినియోగాన్ని పట్టణ ప్రాంతాల్లో పెంచారు. హైదరాబాద్, బెంగుళూరు వంటి ప్రధాన నగరాల్లోని ప్రముఖ భోజన హోటళ్లలో మార్వటాకులు, కాటన్లతో తయారైన ప్లేట్ల వాడకం జరుగుతోంది. ఇలాంటి ప్లేట్లలో భోజనం పెట్టడం వలన ఆ హోటళ్లకు రోజువారీ వచ్చే వినియోగదారుల సంఖ్య పెరుగుతోంది. మన్ననూరులోని కొందరు స్థానిక కూలీల ద్వారా విడిమార్వటాకులు, కుట్టిన విస్తరాకులు కొనుగోలు చేసి పట్టణ ప్రాంతాల్లోని విస్తరాకుల పేట్ల తయారీ నిర్వాహకులకు సరఫరా చేస్తున్నారు.

సలేశ్వరం జాతరలో మార్వటాకు ప్లేట్లను వాడాలని సూచన

కాగా ఈనెల 22 నుంచి 24 వరకు మూడురోజుల పాటు సలేశ్వరం జాతరలో ప్లాస్టిక్ ప్లేట్లను నిషేధించి మార్వటాకులతో తయారయ్యే విస్తరాకుల ప్లేట్లను వాడాలని, ఆలయం వద్ద ప్రసాదం భుజించే భక్తులకు మార్వటాకు కప్పులనే ఉపయోగించాలని అన్నదాన నిర్వాహకులు, ఆలయంలో ప్రసాదాలు అమ్మే నిర్వాహకులకు డీఎఫ్‌వో రోహిత్‌గోపిడి ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం మన్ననూరులో వేల సంఖ్యలో మార్వటాకుల ప్లేట్లను తయారు చేసి సిద్ధంగా ఉంచారు. వాటికి అటవీశాఖ వారు నిర్ణయించిన ధర ను చెల్లించి నిర్వాహకులు తీసుకువెళ్లాల్సి ఉంటుంది. ఇవే ప్లేట్లను శ్రీశైలం, మద్దిమడుగు, ఉమామహేశ్వర క్షేత్రాలకు సరఫరా చేసేందుకు అటవీశాఖ సర్వం సిద్ధం చేసింది.

అడవికి నష్టం జరుగకుండా చర్యలు



అమ్రాబాద్ పులుల అభయారణ్యంలో అడవికి నష్టం జరుగకుండా స్థానికులకు ఉపాధి మార్గాలను చూపించి ప్లాస్టిక్ రహిత ప్రాంతంగా తీర్చిదిద్దాలన్నదే అటవీశాఖ ముందున్న లక్ష్యం. ప్లాసిక్ నిషేధ కార్యక్రమాల కోసం ఇప్పటికే మన్ననూరు కేంద్రంగా స్థానిక యువకులకు అనేక రకాల ఉపాధి అవకాశాలు కల్పించాం. ప్రస్తుతం మార్వటాకులతో తయారు చేసే ప్లేట్లను స్థానిక హోటళ్లలో, అన్నదాన సత్రాల్లో వాడేలా అవగాహన కల్పిస్తాం. ప్రసాదాల కౌంటర్లలోనూ ఈ ప్రాంతంలో తయారయ్యే మార్వటాకుల కప్పులను వాడేలా చేస్తాం. నెమ్మదిగా పర్యావరణ హిత ప్లేట్లను, వస్తువులను నల్లమలలో వాడాలని స్థానికులకు పర్యటకులకు అవగాహన కల్పిస్తాం.

- రోహిత్ గోపిడి, డీఎఫ్‌వో, అమ్రాబాద్ పులుల అభయారణ్య ప్రాంతం

ప్లేట్ల తయారీతో ఉపాధి



మార్వటాకులతో ప్లేట్ల తయారీ కేంద్రం లో పనిచేసే అవకాశం కల్పించినందుకు అటవీ అధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు. ఇంటి పనులు పూర్తి చేసుకొని విస్తరాకుల తయారీ కేంద్రంలో పనిచేయడం వలన తనకు ఇంటి ఖర్చులు వెళ్లదీసుకుంటున్నాను. ఖర్చులు పోను కొన్ని డబ్బులను పొదుపు చేసుకునే అవకాశం దొరికింది. ఇలాంటి ఉపాధి మార్గాలు చూపిస్తే చెంచు గిరిజనులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారు.

- పద్మ, చెంచు గృహిణి , మన్ననూరు

నూటికి నూరుశాతం శ్రేయస్కరం



ప్రస్తుతం అటవీ శాఖ వారు మార్వటాకులు, కాటన్‌తో తయారు చేసే ప్లేట్లు నూటికి నూరు శాతం శ్రేయస్కరం. ఇట్టి ప్లేట్లలో భోజనం చేశాక నేలపై పడేసినా కుళ్లిపోయిన మార్వటాకులు తిరిగి వ్యవసాయ పొలాల్లో ఎరువులుగానూ వాడవచ్చు. కాటన్లు తిరిగి రీసైక్లిన్ చేయవచ్చు. ఇలాంటి పర్యావరణహిత వస్తువులను వాడటం మానవాళికి ఎంతో మేలు. నల్లమల సఫారీ టూర్‌కు వచ్చే పర్యటకులకు ప్లాస్టిక్ వాడకం వలన కలిగే అనర్థాలు, వన్యప్రాణులకు కలిగే నష్టాలను నిత్యం అవగాహన కల్పిస్తూనే ఉన్నాం. నల్లమలలను ప్లాస్టిక్ వాడకం లేని ప్రాంతంగా చూసేందుకు కృషి చేస్తున్నాం.

- శ్వేత, అటవీ విద్యాధికారి, ఏటీఆర్ డివిజన్

గద్వాలలో ఆడబిడ్డను ఎందుకు ఓడించావ్ ?

- బీసీ మహిళకు అన్యాయం చేయలేదా
- గద్వాలలో వ్యవస్థలు నాశనం చేసి మహబూబ్‌నగర్‌కు వచ్చావ్
- గద్వాల జడ్పీ చైర్‌పర్సన్ సరిత



సమావేశంలో మాట్లాడుతున్న గద్వాల జడ్పీ చైర్‌పర్సన్ సరిత

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 21 : ఆడబిడ్డపై ముప్పేట దాడి చేస్తున్నారని సానుభూతి డ్రామా ఆడుతున్న డీకే అరుణ, మరి గద్వాలలో బీసీ బిడ్డనైన తనకు టికెట్ ఇస్తే తనను ఓడించేందుకు మీ కుటుంబ సభ్యుడికి మద్దతు ఎందుకిచ్చారని గద్వాల జడ్పీ చైర్‌పర్సన్ సరిత ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ కురుమ కులానికి చెందిన తనకు టికెట్ ఇచ్చిందని, అక్కడ తాను గెలుస్తానని, బీసీని బరిలోదించి ఆయనకు మద్దతివ్వకుండా బీఆర్ఎస్ అభ్యర్థి కుటుంబానికి చెందిన వ్యక్తికి మద్దతిచ్చి మహిళనైన తనకు అన్యాయం చేశారన్నారు. జాతీయ పార్టీ ఉపాధ్యక్షురాలిగా ఉన్న ఆమె తన నియోజకవర్గంలో బీజేపీకి ఏడు వేల ఓట్లు మాత్రమే వచ్చాయంటే ఆమె బీజేపీకి పనిచేయలేదని ఆ పార్టీ పెద్దలకు కూడా అర్థమైందన్నారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. గద్వాలలో ఆమె చేయాల్సిన దందాలన్నీ అయిపోయాయని, అక్కడ వ్యవస్థలు నాశనం చేశారని, ఇప్పుడు మహబూబ్‌నగర్‌కు వస్తున్నారని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. తండ్రి పేరు చెప్పుకొని పబ్బం గడుపుతున్నారే తప్ప ఆమె జిల్లాకు చేసిందేమీ లేదని తెలిపారు. గద్వాల వెనుకబాటుకు డీకే అరుణే కారణమన్నారు. మక్తల్‌లో శ్రీహరిని ఓడించాలని బీఆర్ఎస్‌కు మద్దతిచ్చారని, నాగర్‌కర్నూల్‌లో బంగారు శృతికి టికెట్ రాకుండా చేశారని, ఆమె గెలిస్తే మహిళా కోటాలో ఎక్కడ మంత్రి అవుతారోనని తన రాజకీయస్వార్థం కోసం ఆమెకు టికెట్ దక్కకుండా చేశారని సరిత ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీలో ఉన్నప్పుడు స్వర్ణాసుధాకర్‌రెడ్డిని అణగదొక్కారని, మహబూబ్‌నగర్‌లో సీనియర్ నాయకులు బీసీ అభ్యర్థి శాంతకుమార్‌కు టికెట్‌రా కుండా అడ్డుపడ్డారని, బీసీలపై ప్రేమ ఉంటే ఇప్పటికైనా సమయం ఉందని, ఆమె తప్పుకుని బీసీ అభ్యర్థికి అవకాశం వచ్చేలా చేస్తే బీసీలపై చిత్తశుద్ధి ఉందని భావిస్తామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అనని మాటలు అన్నట్లు మీరే చిత్రీకరించుకుని చేస్తున్న రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. మేము వెనుకబడిన జాతులమే కావచ్చుకానీ విజ్ఞతలో వెనకబడలేదని, అన్నీ గమనిస్తున్నామని కురుమ, యాదవ సోదరులే కాక బడుగు, బలహీనవర్గాలన్నీ ఆలోచన చేయాలని, అలాంటి వ్యక్తిని ఓడించేందుకు అందరం ఏకం కావాలని పిలుపునిచ్చారు. గద్వాలలో దందాలన్నీ అయిపోయాయని, పాలమూరు మీద పడ్డారని, పేదవాళ్లకు మేలు చేయాలన్న ఆలోచన ఆమెకు ఏమాత్రమూ లేదన్నారు. ఈ సమావేశంలో టీపీసీసీ అధికారప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి, సిరాజ్ ఖాద్రి, సీజే బెనహర్ పాల్గొన్నారు.

వంశీచంద్ గెలుపుకోసం కృషి చేయాలి

భూత్పూర్ : కాంగ్రెస్ పార్టీ పాలమూరు ఎంపీ అభ్యర్థిగా చల్లా వంశీచంద్‌రెడ్డి గెలుపు కోసం ప్రతీ కాంగ్రెస్ కార్యకర్త పట్టుదలతో పనిచేయాలని గద్వాల జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సరిత పిలుపునిచ్చారు. ఆదివారం మునిసిపాలిటీ పరిధిలోని అమిస్తాపూర్ గ్రామంలో కురుమయాదవ్ సంఘం నాయకులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు కురుమ, యాదవులంతా ఏకమై చల్లా వంశీచంద్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని కోరారు. ప్రజల్లో కాంగ్రెస్ అంటే ఒక నమ్మకం ఏర్పడిందని, సీఎం పేదల అభ్యున్నతి కోసం పాటు పడుతున్న విధానం ప్రజలకు అర్థం అయ్యేలా ప్రతీ కార్యకర్త ప్రచారం చేయాలని సూచించారు. కురుమ యాదవ సంఘం నాయకులు నరేంద్, మట్టి ఆనంద్, సునీల్, శివ రాములు, పవన్ కుమార్, మన్నన్, జహంగీర్, మల్లికార్జున్, ఆగిరి తిరుపతయ్య, డోకూరు శేఖర్, ఊరడి తిరుపతయ్య పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

- ఎండిన వరి పంటను పరిశీలించిన మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్



నాయినోనిపల్లిలో ఎండిన వరి పంటను పరిశీలిస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

హన్వాడ, ఏప్రిల్ 21 : పంటలు ఎండి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలం నాయినోనిపల్లి గ్రామ శివారులో ఎండిన వరి పంటను స్థానిక నాయకులతో కలిసి మాజీ మంత్రి పరిశీలించారు. తిరుమలగిరిలో గ్రామాల పరిస్థితులను ప్రజలను, కూలీలను అడిగి తెలుసుకున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో రైతులు సాగుచేసిన పంటలు పండి రైతు లాభం వచ్చిందని, ప్రస్తుతం రైతులు సాగు చేసిన పంటలు ఎండి నష్టపోతున్నారని అన్నారు. ప్రభుత్వం ఎండిన పంటలను పరిశీలించి వారిని ఆదుకోవాలని కోరారు. గత పాలనకు ఈ పాలనకు ఎంతో తేడా ఉందని ప్రజలు అంటున్నారని ఆయన అన్నారు. ప్రజలు, రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన వెంట ఎంపీపీ బాలరాజు, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కరుణాకర్‌గౌడ్, మాజీ అధ్యక్షుడు కొండ లక్ష్మయ్య, మాజీ జడ్పీటీసీ నరేందర్, సొసైటీ చైర్మన్ వెంకటయ్య, నాయకులు శివకుమార్, బాలకిష్టయ్య, ఆశన్న పాల్గొన్నారు.

చీరల దొంగతనంపై కేసు నమోదు

గద్వాల క్రైం, ఏప్రిల్ 21 : గద్వాల జిల్లా కేంద్రంలోని విఘ్నేశ్వర్ హ్యాండ్లూమ్‌లో చీరలు దొంగతనంపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు పట్టణ రెండవ ఎస్ఐ రాము తెలిపారు. ఇందుకు సంబంధించి ఆయన కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గద్వాల పట్టణంలోని కిష్టారెడ్డి బంగ్లాలోని చీరల దుకాణంలో శనివారం ఓ కారులో ఇద్దరు పురుషులు, ఒక మహిళ వచ్చారు. దుకాణ యజమాని తాతయ్యను మాటల్లో పెట్టి ఏడు చీరలను మహిళ దొంగలించి కారులో వెళ్తుండగా దుకాణ నిర్వాహకుడు వినోద్ వచ్చాడు.

చీరలను దొంగలించిన విషయం గ్రహించి కారు వెంట పడగా మూడు చీరలను పారవేశారు. వినోద్ వాటిని తీసుకునే క్రమంలో మిగితా నాలుగు చీరలతో ఉడాయించారు. వీటి విలువ దాదాపు 28,000 ఉంటుందని వినోద్ తెల్పడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఏది ఏమైనా ఈ చీరలను దొంగలించనవారిని త్వరలో పట్టుకొని వారిపై కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ తెలిపారు.

పురుగుల మందు తాగి ఏఈవో మృతి



రామాంజనేయులు యాదవ్

కల్వకుర్తి, ఏప్రిల్ 21 : పురుగుల మందు తాగి ఏఈవో మృతి చెందిన సంటన నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలో ఆదివారం చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు స్థానికుల కథనం ప్రకారం.. కోడేరు మండలం సింగాయిపల్లికి చెందిన కడారి రామాంజనేయులుయాదవ్(25)చారకొండ మండలంలోని గోకారంలో ఏఈవోగా 2019 నుంచి పని చేస్తున్నారు. కల్వకుర్తి పట్టణంలోని స్వాతి గార్డెన్స్ సమీపంలో ఆదివారం రామాంజనేయులు పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గుర్తించిన స్థానికులు వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే అతను మృతి చెందాడు. మృతుడు కల్వకుర్తి పట్టణంలో భార్య సంతోష, కుమారుడు శన్ముక్‌తో కలిసి ఇంటిని అద్దెకు తీసుకుని ఉన్నాడు. మృతికి సంబంధించిన వివరాలు తెలియాల్సి ఉంది.

పుల్లూరు టోల్ ప్లాజా వద్ద నగదు పట్టివేత

అలంపూర్ చౌరస్తా, ఏప్రిల్ 21: గద్వాల జిల్లా ఉండవల్లి మండల పరిధిలోని ఏపీ తెలంగాణ సరిహద్దు ప్రాంతమైన పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద ఎన్నికల నేపథ్యంలో నిర్వహిస్తున్న తనిఖీల్లో రూ.71200లు నగదు పట్టుకున్నట్లు ఉండవల్లి ఎస్సై శ్రీనివాస్‌నాయక్ తెలిపారు. పుట్టపర్తి జిల్లా, గోరంట్ల గ్రామానికి చెందిన ఎస్ షఫీ ఉల్లా అనే వ్యక్తి ఆదివారం హైదరాబాదు నుంచి గోరంట్లకు బొలెరో వాహనంలో వెళ్తుండగా సరిహద్దులో చేస్తున్న తనిఖీల్లో పట్టుపడ్డారు. పళ్ల వ్యాపారం చేసే అతడి వద్ద ఏలాంటి రశీదులు లేకపోవడంతో నగదును స్వాధీనం చేసుకున్నారు. సదరు నగదును గ్రీవెన్స్‌సెల్‌కు అప్పగించనున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతున్న యువకుడు

మానవపాడు, ఏప్రిల్ 21: గద్వాల జిల్లా మానవపాడు మండలంలోని అమరవాయి గ్రామానికి చెందిన సాధిక్ (26)అనే యువకుడు ఒంటిపై కెమికల్ రంగును పోసుకుని శుక్రవారం రాత్రి నిప్పు అంటించుకొని ఆత్మహత్యాయత్నం చేసుకున్నట్లు ఎస్ఐ చంద్రకాంత్ తెలిపారు. కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రమాదవశాత్తు వ్యక్తి మృతి



కరిగళ్ల రామచంద్రయ్య

బిజినేపల్లి, ఏప్రిల్ 21 : నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండల కేంద్రంలోని ఒక వార్డులో మంచినీటి సరఫరా చేసే గేట్‌వాల్ తిప్పుతూ ప్రమాదవశాత్తు ఆదివారం ఉదయం వాటర్‌మెన్ కరిగళ్ల రామచంద్రయ్య 56) అనే వ్యక్తి మృతి చెందాడు. ఎస్సై నాగశేఖర్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. ఆదివారం ఉదయం ఆరు గంటల సమయంలో ఒకటో వార్డులోని వాటర్ ట్యాంక్ గేట్‌వాల్ తిప్పేందుకు వెళ్లాడు. ఇదే గ్రామానికి చెందిన మొల్గర రాములు అటుగా వెళ్తుండగా మృతుడు గేట్‌వాల్ వద్ద పడి ఉండడం గుర్తించి వెంటనే రామచంద్రయ్య భార్యకు సమాచారం ఇచ్చాడు. ఇనుపగేట్ వాల్ తలకు, నుదుటిపై బలంగా తగలంతో రక్తగాయాలై అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య పోచమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి



భాస్కర్

కొత్తకోట, ఏప్రిల్ 21 : వనపర్తి జిల్లా కొత్తకోట మండలంలోని కనిమెట్ట గ్రామానికి చెందిన బీ ఫార్మసీ విద్యార్థి రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఎస్ మంజునాథ్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... భాస్కర్ (23) వనపర్తి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ కళాశాలలో బీ ఫార్మసీ అభ్యసిస్తున్నారు. ఆదివా రం స్వగ్రామం నుంచి కొత్తకోటకు ద్విచక్రవాహనంపై వె ళ్తుండగా వెనక నుంచి కారు ఢీకొట్టింది. తలకు బలమైన గాయం కావడంతో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలిం చారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు చెప్పడంతో తల్లిదండ్రులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

ఎమ్మెల్యే పరామర్శ ..

బాధిత కుటుంబాన్ని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతికి సంతాపం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వెంట శేఖర్‌రెడ్డి, కర్ణాకర్‌రెడ్డి, వెంకటరమణ, సాయులు యాదవ్, కోటేశ్వర్ రెడ్డి, పెంటన్న, నాగేశ్వర్‌రెడ్డి ఉన్నారు.

వ్యక్తిపై హత్యాయత్నం

పెబ్బేరు, ఏప్రిల్ 21 : పెబ్బేరు పట్టణంలో వ్యక్తిపై హత్యాయత్నం జరిగింది. ఎస్ఐ సాయిప్రసాద్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... పెబ్బేరు పట్టణానికి చెందిన గుండ్రాతి నరసింహగౌడ్ ఆదివారం తెల్లవారు జామున తన పశువుల కొట్టం వద్దకు నడుచుకుంటూ వెళ్తున్నాడు.. వనపర్తి వెళ్లే రహదారి జూరాల కాలువ సమీపంలో నెంబర్ ప్లేట్ లేని కారులో నుంచి నలుగురు, నెంబర్ ప్లేట్ లేని బైక్‌పై నుంచి ఇద్దరు మొత్తం ఆరుగురు వ్యక్తులు ఆయనపై కట్టెలతో దాడి చేసినట్లు బాధితుడు నరసింహగౌడ్ తెలిపారు. కట్టెలతో దాడి చేయడంతో తలకు గాయం కావడంతో బాధితుడు పెద్దగా కేకలు వేశాడు. దాంతో దుండగులు పారిపోయిన ట్లు తెలిపారు. కొంత కాలంగా దాయాదులతో ఆస్తి తగాదాలు కోర్టులో ఉండడంతో వారు చేయించిన పనే అయి ఉంటుందని భావిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశా రు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకు న్నట్లు ఎస్ఐ సాయిప్రసాద్‌రెడ్డి తెలిపారు.

ప్రబీర్ పుర్కాయస్థ పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

కల్వకుర్తి, ఏప్రిల్ 21 : కల్వకుర్తి పట్టణంలోని యూటీఎఫ్ భవన్‌లో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ప్రబీర్ పుర్కాయాస్థ పుస్తకావిష్కరణ ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ సాంస్కృతిక సాహితీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనందాచారి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 8 నెలల క్రితం ప్రబీర్ పుర్కాయాస్థను మోదీ ప్రభుత్వం జైల్లో పెట్టిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతీ ఒక్కరు తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. నాయకులు ఏపీ మల్లయ్య, ఆంజనేయులు, పరుశారాములు. నెహ్రూప్రసాద్, పాండయ్య, కే వేంకటేశ్వర్లు, చిలుక బాల్‌రెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరు దైవ చింతన కలిగి ఉండాలి



ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

కల్వకుర్తి, ఏప్రిల్ 21 : ప్రతీ ఒక్కరు దైవ చింతన కలిగి ఉండాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. సత్ప్రవర్తన, సద్గుణాలు మనుషుల్లో విరాజిల్లాలంటే దైవ భక్తి అవసరమన్నారు. కల్వకుర్తి పట్టణంలో శ్రీమల్లాలమ్మ తల్లి దేవాలయంలో జరిగిన బోనాల ఉత్సవాలకు ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి, జడ్పీ వైస్ చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు, కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్ హాజరయ్యారు.

ఈ సందర్భంగా మల్లాలమ్మ తల్లిని దర్శించుకుని వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ మల్లాలమ్మ తల్లి కృపకు ప్రతీ ఒక్కరు పాత్రులు కావాలని కోరారు. కల్వకుర్తి నియోజకవర్గంలో దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం తగిన విధంగా చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. పేద వర్గాల అభివృద్ధి సంక్షేమానికి తాను నిరంతరం కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. మేదరి సంఘం నాయకులు లక్ష్మణ్, శివకుమార్, సంజీవ్, రమాకాంత్, కృష్ణయ్య, వెంకటేశ్, కాంగ్రెస్ నాయకులు షానవాజ్‌ఖాన్, సంజీవ్‌కుమార్‌యాదవ్, పలువురు నాయకులు తదితరులు ఉన్నారు.

ప్రారంభమైన హనుమాన్ జయంతి ఉత్సవాలు

కల్వకుర్తి, ఏప్రిల్ 21 : కల్వకుర్తి పట్టణంలోని సీతారామాంజనేయ స్వామి దేవాలయంలో మూడు రోజుల పాటు జరిగే హనుమాన్ జయంతి ఉత్సవాలు ఆదివారం అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. ఉత్సవాలను దయానందగిరి స్వాములు, డాక్టర్ దామోదర్ రెడ్డి, మాజీ మునిసిపల్ చైర్మన్ రాచోటి శ్రీశైలంలు లాంఛనంగా ప్రారంభించారు.

అనంతరం గోపూజా నిర్వహించారు. హోమాలలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. దైవభక్తి మానసిక ప్రశాంతతకు దోహదపడుతుందని వారు పేర్కొన్నారు. ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.



ఉత్సవాలను ప్రారంభిస్తున్న నాయకులు

సలేశ్వరం లింగమయ్యపై నూతన పాట సీడీ ఆవిష్కరణ

అచ్చంపేట, ఏప్రిల్ 21 : పౌర్ణమి రోజు(ఈ నెల 23న) నిర్వహిస్తున్న సలేశ్వరం జాతర సందర్భంగా లింగమయ్యపై లింగాల మండల పరిధిలోని అప్పాయిపల్లి గ్రామానికి చెందిన వేముల శివరామ్ రాసిన నూతన పాటకు సంబంధించిన సీడీని ఆదివారం స్థానిక అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నల్లమలలోని సినిమా ఫీల్డ్‌లో ఉన్న కవులు, కళాకారులు రాసిన పాటలు డాక్యుమెంటరీలను ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఆవిష్కరించే విధంగా కృషి చేస్తామన్నారు.

తెలంగాణ అడ్వకేట్ జనరల్‌ను సన్మానించిన సుప్రీంకోర్టు న్యాయాధికారి

కొల్లాపూర్, ఏప్రిల్ 21 : తెలంగాణ అడ్వకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డిని 2009-10సంవత్సరానికి సంబంధించిన హైకోర్టు అడ్వకేట్ అసోసియేషన్ వారు ఆదివారం ఘనంగా సన్మానించారు. నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం ముష్టిపల్లి గ్రామానికి చెందిన సుప్రీంకోర్టు న్యాయవాది డీఎల్.పాండు 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. 15సంవత్సరాల క్రితం ఉమ్మడి రాష్ట్ర హైకోర్టు న్యాయవాదుల సంఘానికి అధ్యక్షుడిగా పని చేసిన సుదర్శన్‌రెడ్డిని నేడు తెలంగాణ అడ్వకేట్ జనరల్ పదవీ బాధ్యతలు చేపట్టడం, ప్రధాన కార్యదర్శిగా పని చేసిన నంద న్యాయాధికారిణిగా పదవీ బాధ్యతలు స్వీకరించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. వారితోపాటు తాను కూడా ఉమ్మడి రాష్ట్ర హైకోర్టు న్యాయవాద సంఘానికి జాయింట్ సెక్రటరీగా పని చేసినట్లు ఆయన పేర్కొన్నారు. అడ్వకేట్ జనరల్‌గా ఎ.సుదర్శన్‌రెడ్డి, జస్టిస్‌గా నంద పదవీ బాధ్యతలు చేపట్టడంతో ఆదివారం హైదరాబాద్‌లోని గోల్కొండ హోటల్‌లో వారికి అభినందన సభ నిర్వహించినట్లు డీఎల్ పాండు పేర్కొన్నారు.

ఎంపీగా గెలిపిస్తే పార్లమెంట్‌లో పోరాడుతాం

- బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



పెంట్లవెల్లిలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

పెంట్లవెల్లి, ఏప్రిల్ 21 : నాగర్‌కర్నూల్ ఎంపీగా గెలిపిస్తే నిరుపేదల సమస్యలపై పోరాటాలు చేస్తానని నాగర్‌కర్నూల్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అత్యున్నతమైన ఐపీఎస్ ప్రభుత్వ ఉద్యోగాన్ని వదులుకుని ప్రజలకు సేవా చేయాలనే సంకల్పంతో వచ్చానని వారు పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు అభిలాష్‌రావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోతుల వెంకటేశ్వర్లు, సింగిల్ విండో చైర్మన్ విజయరామారావు, బీఆర్ఎస్ నాయకులు రాజేష్, సురేందర్‌గౌడ్, గోపురాజు, బంకల నరసింహ, రాము, రఫియోద్దీన్, అబ్దుల్ హాసేన్, జ్ఞానేశ్వర్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి- కేసు నమోదు

వెల్దండ, ఏప్రిల్ 21: మండల పరిధిలోని కొట్ర గ్రామానికి చెందిన నిరటి నర్సింహ్మా అనే వ్యక్తిపై దాడి చేసిన అదే గ్రామానికి చెందిన రామకృష్ణపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవి తెలిపారు. రామకృష్ణ, నర్సింహలు ఈ నెల 17న ఘర్షణ పడ్డారు.

దీంతో నర్సింహను రామకృష్ణ కొట్టి గాయప ర్చాడు. బాధితుని కుమారుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు.

వ్యవసాయ పొలాల్లో వేసవిలో ముమ్మరంగా పని

- మండలంలో రోజుకు రెండు నుంచి మూడు వేల మంది కూలీల హాజరు
- గరిష్ఠంగా రూ.300ల వేతనం

అమ్రాబాద్ ఏప్రిల్ 21: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా వేసవి సీజన్లో రైతుల వ్యవసాయ పొలాల్లో చెట్లు, రాళ్లను తొలగించడంతో పాటు చదును చేయడం ద్వారా కూలీలకు ముమ్మరంగా పని దొరకుతున్నది. అమ్రాబాద్ మండలంలోని 20 గ్రామ పంచాయతీలలో 8 వేల పైచిలుకు ఎన్ ఆర్ ఈజీఎస్ ద్వారా కూలీలకు జాబ్ కార్డులు జారీ చేశారు. ప్రస్తుత సీజన్లో అన్ని గ్రామపంచాయతీల పరిధిలో రోజుకు రెండు వేల నుంచి మూడు వేల మంది కూలీలు పనిలో పాల్గొంటున్నారు. 2023-2024 వార్షిక సంవత్సరంలో మండలంలో రెండు లక్షల పని దినాలు కల్పించారు. దీని ద్వారా సమారు 6 కోట్ల రూపాయలు కూలీలకు చెల్లించాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నారు. దీని ద్వారా రైతుల పొలాలు చదును కానున్నాయని చెప్పవచ్చు.



అమ్రాబాద్ మండలం కుమ్మరోనిపల్లెలో వ్యవసాయ పొలంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

వేసవి ఎండ తీవ్రతలో కూడా తగ్గని కూలీలు



ఈ వేసవిలో ఎండ తీవ్రత ఎంతో ఉన్నప్పటికీ కూడా కూలీలు లెక్కచేయకుండా ఉపాధి హామీ పథకం పనులలో పాల్గొంటున్నారు. ఆయా గ్రామాల్లో వ్యవసాయ పొలాల గట్ల వద్ద ఉన్న చెట్లను తొలగించడం, పొలాల్లో ఉన్న రాళ్లను తీయడంతో పాటు చదును చేసే కార్యక్రమాన్ని ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. వారికి ప్రభుత్వం రోజుకు గరిష్ఠంగా రూ.300 నిర్ణయించినప్పటికీ ప్రస్తుతం పని ద్వారా 220 రూపాయల వేతనం అందుతున్నది. సకాలంలో వారికి చేసిన పనికి డబ్బులు అందే విధంగా ప్రభుత్వం ద్వారా కృషి చేస్తున్నాం.

- రఘు, ఏపీవో అమ్రాబాద్ మండలం

ప్రభుత్వం నిర్ణయించిన రూ.300 వేతనం చెల్లించాలి



ఉపాధి హామీ పథకం ద్వారా తాము పనులు చేస్తున్నప్పటికీ పనికి తగ్గ వేతనం అందడం లేదు. వేసవి కాలం కావడంతో పొలాలు బాగా గట్టిబారిపోవడం మూలంగా తాము ఎంతో శ్రమించినప్పటికీ 200 నుంచి 220 రూపాయల వరకే వేతనం అందుతున్నది.

మెజర్మెంట్ ద్వారా కాకుండా ప్రభుత్వం గరిష్ఠంగా నిర్ణయించిన రూ.300 వేతనం ప్రతీ ఒక్క కూలీకి అందే విధంగా చర్యలు తీసుకోవాలి.

- సామెళ్ల లక్ష్మమ్మ, ఉపాధి హామీ కూలి, మాధవానిపల్లి

పోడు భూముల పట్టాలు కాంగ్రెస్‌తోనే సాధ్యం

- పదేళ్లు అధికారంలో ఉన్న బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు ఓట్లు అడిగే అర్హత లేదు
- గిరిజనులంతా సంఘటితమవుదాం.. పోడు భూముల పట్టాలు సాధించుకుందాం
- గిరిజన అభివృద్ధి సంస్థ చైర్మన్, ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నేనావత్ బెల్లయ్యనాయక్

కందనూలు, ఏప్రిల్ 21 : గిరిజనుల, ఆదివాసీల పోడు భూములకు పట్టాలు కాంగ్రెస్‌తోనే సాధ్యమని గిరిజన అభివృద్ధి సంస్థ చైర్మన్, ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నేనావత్ బెల్లయ్యనాయక్ అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి ఇంటి వద్ద ఆదివాసి గిరిజనులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ గిరిజనులమంతా సంఘటితంగా పోరాడి పోడు భూములకు పట్టాలు సాధించుకుందామని ఆయన పిలుపునిచ్చారు. గత పదేళ్ల కాలంగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం రెండు కూడా గిరిజనులకు పోడు భూముల పట్టాల పంపిణీకి మొండి చేయి చూపాయన్నారు. ఆనాడు కాంగ్రెస్ ప్రభుత్వంలోని ఇందిరా గాంధీ గిరిజనులకు ఆదివాసీల అభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తారన్నారు.



మట్లాడుతున్న గిరిజన అభివృద్ధి సంస్థ చైర్మన్, ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నేనావత్ బెల్లయ్యనాయక్

ప్రస్తుతం రాష్ట్రంలో అధికారం ఉన్న కాంగ్రెస్ పార్టీ కేంద్రంలోనూ అధికారం కట్టపెట్టేలా వచ్చే మే 13న జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రె స్ పార్టీ అభ్యర్థి మల్లురవికి ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించుకోవాల్సిన బాధ్యత గిరిజనులపై ఉందన్నారు. సమావేశంలో వారితోపాటు ఆదివాసి కాంగ్రెస్ వైస్ చైర్మన్ రఘునాయక్, ఆదివాసి రాష్ట్ర జనరల్ సెక్రటరీ వాల్యానాయక్, మాజీ జడ్పీటీసీ సభ్యుడు కొల్లాపూర్ హనుమంతునాయక్, వనపర్తి ఎంపీపీ శంకర్‌నాయక్, సేవాలాల్ సేన అధ్యక్షుడు గోపాల్‌నాయక్, లట్టుపల్లి సర్పంచ్ గోవిందనాయక్, తెలకపల్లి మాజీ సర్పంచ్ బద్యానాయక్, మాజీ ఎంపీటీసీ మాన్యనాయక్ తదితరులు ఉన్నారు.

అభివృద్ధి చేసేందుకే మీ ముందుకు

- కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి మల్లురవి

బల్మూరు, ఏప్రిల్ 21 : నల్లమల ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకే మీ ముందుకు వచ్చానని నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మల్లురవి అన్నారు. ఆదివారం మండలంలోని సీతారాంపురం, కొండనాగుల, బల్మూరు, అనంతవరం గ్రామాల్లో ఆయన రోడ్ షోలో పాల్గొని ప్రజలనుద్దేశించి మాట్లాడారు. రాహుల్ గాంధీ మహిళలకు లక్ష రూపాయలు ఇస్తారని, అదేవి ధంగా వివిధ అభివృద్ధి పనులకు నా శాయాశక్తుల పూర్తి స్థాయిలో పని చేస్తానని అన్నారు. ఈ సందర్భం గా ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ నల్లమల ప్రాంతం అభివృద్ధి జరగాలంటే ఎంపీతో కొన్ని నిధులు తీసుకుని రాష్ట్రంలో కొన్ని నిధులు తీసుకుని నల్లమల ప్రాంతానికి పూర్తి స్థాయి అభివృద్ధి చేసేటప్పుడు కృషి అవుతుందని ఆయన అన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు ప్రతి ఒక్కరు బుద్ధి చెప్పి కాంగ్రెస్ పార్టీకి అవకాశం కల్పించాలని అన్నారు. మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, గిరివర్ధన్‌గౌడ్, కాశన్నయాదవ్, ఖదీర్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

లింగాల:పేదరిక నిర్మూలన బడుగు బలహీన వర్గాల అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న కాంగ్రెస్ పార్టీతోనే సమగ్ర అభివృద్ధి సాధ్యమని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ మల్లు రవి అన్నారు. ఆదివారం రాత్రి డీసీసీ అధ్యక్షుడు, అచ్చంపేట శాసనసభ్యుడు డాక్టర్ వంశీకృష్ణతో కలిసి లింగాలలో రోడ్‌షో నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు, రాష్ట్ర నాయకుడు రంగినేని శ్రీనివాస్‌రావు. యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రాథోడ్, మాజీ సింగిల్ విండో ఉపాధ్యక్షుడు లక్ష్మన్‌నాయక్, పట్టణ అధ్యక్షుడు వెంకటయ్య, మహిళా అధ్యక్షురాలు ఇందిరమ్మ, విజయలక్ష్మీ తదితరులు పాల్గొనారు.



బల్మూరు రోడ్‌షోలో పాల్గొన్న డాక్టర్ మల్లు రవి

వేసవి క్రికెట్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

కందనూలు, ఏప్రిల్ 21 : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని నల్లవెల్లిలోని నాగర్‌కర్నూల్ క్రికెట్ అకాడమీ మైదానంలో నెలరోజుల పాటు నిర్వహించనున్న ఉచిత క్రికెట్ శిక్షణ శిబిరాన్ని ఆదివారం ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎం.రాజశేఖర్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్, మహబూబ్‌నగర్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణ శిబిరాన్ని ఈ ప్రాంత యువకులు సద్వినియోగం చేసుకుని క్రికెట్ రంగంలో రాణించాలని ఆయన కోరారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో నిర్వహిస్తున్న శిక్షణ శిబిరాలకు శిక్షణ ఇన్‌చార్జిలుగా మహమ్మద్ మోసిన్, సతీష్‌లు ఉంటారని ఆయన తెలిపారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇప్పటికే వేసవి ఉచిత శిక్షణ శిబిరాలకు అనూహ్యస్పందన వస్తుందన్నారు.

నాగర్‌కర్నూల్ పట్టణంలో 97 మంది యువకులు తమ పేర్లను నమోదు చేసుకుని శిక్షణ కోసం రావడం అభినందనీయమన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో నెలరోజుల పాటు నిర్వహిస్తున్న క్రికెట్ శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకుని క్రికెట్ క్రీడా పట్ల మెలకువలు నేర్చుకోవాలని మహమ్మద్ మోసిన్, సతీష్‌లు అన్నారు. సీనియర్ క్రీడాకారులు రామన్‌గౌడ్, శిక్షణ పొందే క్రీడాకారులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.



వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి రాజశేఖర్

నిండుకున్న మోరీలు.. వెలగని వీధి దీపాలు

- పట్టించుకొని పంచాయతీ కార్యదర్శి
- రాత్రిళ్లు దొంగల భయం, పగలు దుర్గధంతో అవస్థలు

బిజినేపల్లి, ఏప్రిల్ 21 : ఒకప్పుడు ఆదర్శ గ్రామంగా వెలుగొందిన పాలెం గ్రామం నేడు పట్టించుకునే నాథుడు కరువై సమస్యలతో ప్రజలు ఇక్కట్ల పాలవుతున్నారు. ఫిబ్రవరి ఒకటితో సర్పంచుల పదవీకాలం ముగియడంతో ప్రత్యేక అధికారుల పాలన మొదలైనప్పటి నుంచి గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు అధికారులు తిలోదకాలు ఇచ్చారు. దీనితో రోజు రోజుకు సమస్యలు పెరిగి ప్రజా జీవనంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. మండలంలోని ఏకైక మేజర్ గ్రామ పంచాయతీ పాలెం గ్రామం. కావల్సినంత మంది సిబ్బంది ఉన్నారు. అయినా కాలనీల్లో పేరుకుపోయిన మురుగు నీటి కాలువలను శుభ్రం చేయించకపోవడంతో దుర్గంధం వెదజల్లి కాలనీల్లోని ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. రాత్రిళ్ల గ్రామంలోని కొన్ని కాలనీల్లో వీధిదీపాలు వెలగకపోవడంతో చీకట్లో దొంగల భయంతో ఇంట్లో నుంచి బయటకు వచ్చేందుకు జంకుతున్నామని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మోరీలను శుభ్రం చేయడంతో పాటు వెలగని వీధిదీపాలను తీసి కొత్తవి వేయాలని సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శి చిన్న బీరయ్యకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని గ్రామ ప్రజలు విమర్శించడం గమనార్హం. ఈ మధ్యకాలంలో గ్రామంలో రెండు మూడు ఇళ్లలో దొంగలు పడి నగదు, నగలు దోచుకెళ్లిన ఘటనలు చోటు చేసుకున్నాయి. రాత్రి వేళల్లో విష పురుగుల భయానికి నడుచుకుంటూ వెళ్లాలంటే భయపడాల్సి వస్తుందని వాపోతున్నారు.ఇప్పటికైనా సంబంధిత శాఖ ఉన్నతాధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న పంచాయతీ కార్యదర్శిపై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని పలువురు గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.



పాలెంలో మురుగుతో నిండిపోయిన మోరీ

దుర్వాసన, దోమల బెడద ఎక్కువైంది



కొన్ని రోజులుగా టీచర్స్ కాలనీలో మురుగు కాలువలు నిండిపోయి దుర్వాసన, దోమల బెడద ఎక్కువైంది. దోమ కాటుతో చిన్నపిల్లలు తీవ్ర అనారోగ్యాల పాలవుతున్నారు. మురుగనీటి కాలువలను శుభ్రం చేయాలని పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో మా సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదు. విధులపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న పంచాయతీ కార్యదర్శిపై తగు చర్యలు తీసుకోవాలి.

- మనిగిళ్ల ఆంజనేయులు, పాలెం

పాత హాస్టల్ కాలనీలో వీధిలైట్లు వెలుగక నెల దాటింది



పాత హాస్టల్ కాలనీలో వీధిలైట్లు వెలుగక నెల దాటింది. పాలెం బస్టాండ్‌లో బస్సు దిగి గుడ్లనర్వ గ్రామానికి కాలి నడకన వెళ్లేవాళ్ళు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఎన్నోమార్లు పంచాయతీ కార్యదర్శికి విన్నవించినా రేపు మాపు అంటూ కాలయాపన చేస్తున్నారు. ఇంతవరకు వీధిలైట్లు వేస్తలేవని నిలదీస్తే టాక్సీలు కడితేనే సిబ్బంది పనిచేస్తారని బాధ్యతారహితంగా సమాధానం ఇస్తున్నాడు.

- దుగ్యాని బీరయ్య, గ్రామస్థుడు, పాలెం

సలేశ్వరం జాతరకు ఆర్టీసీ బస్సులు ఏర్పాటు

కొల్లాపూర్, ఏప్రిల్ 21 : సలేశ్వరం పుణ్య క్షేత్రానికి కొల్లాపూర్ ఆర్టీసీ బస్టాండ్ నుంచి సోమవారం ఉదయం 4 గంటలకు, 6గంటలకు, 8గంటలకు ఆర్టీసీ బస్సులు బయల్దేరుతాయని డిపో మేనేజర్ ఉమాశంకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కొల్లాపూర్ నియోజకవర్గ కేంద్రం నుంచి సలేశ్వరం పుణ్యక్షేత్రానికి పెద్ద ఎత్తున భక్తులు తరలి వెళ్లనుండడంతో ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేసినట్లు ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగపర్చుకోవాలని డిపో మేనేజర్ ఉమాశంకర్ తెలిపారు.

మే డే వాల్‌పోస్టర్ విడుదల

ఉప్పునుంతల, ఏప్రిల్ 21: మండల పరిధిలోని లక్ష్మాపూర్ గ్రామంలో ఆదివారం ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్ ఆధ్వర్యంలో మేడే వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే డే దినోత్సవాన్ని విజయవంతం చేసుకుందామని ఆయన కార్మికులకు పిలుపునిచ్చారు. నాయకులు శ్రీనివాసులు, వెంకటేష్, కృష్ణయ్య, బాలయ్య, ఈశ్వరయ్య నారాయణ, వెంకటయ్య తదితరులు ఉన్నారు.

మైసమ్మ దర్శనానికి తగ్గిన భక్తుల రద్దీ

పెద్దకొత్తపల్లి, ఏప్రిల్ 21 : మండల పరిధిలోని నాయినోనిపల్లి గ్రామ శివారులో భక్తుల కొంగుబంగారంగా వెలసిన మైసమ్మ దేవత దర్శనం కోసం ఈ ఆదివారం భక్తుల రద్దీ తగ్గింది. ఉమ్మడి పాలమూరు జిల్లా నలుమూలల నుంచి ఈ ఆదివారం దాదాపు 8వేలకు పైగా మంది భక్తులు మైసమ్మ దేవతను దర్శనం చేసుకుని తమ తమ మొక్కుబడులు తీర్చుకున్నారు. భక్తుల నుంచి ఈ ఆదివారం మైసమ్మ దేవతకు హుండీ ద్వారా రూ.62వేలు, టికెట్ల ద్వారా రూ.21 వేలు మొత్తం రూ.83వేల ఆదాయం వచ్చినట్లు చైర్మన్ శ్రీనివాస్ యాదవ్, ఈవో రంగారావు తెలిపారు.

'దేశం సుభిక్షంగా ఉండాలంటే కాంగ్రెస్ అధికారంలో ఉండాలి'

వంగూరు, ఏప్రిల్ 21: దేశం సుభిక్షంగా ఉండాలంటే కాంగ్రెస్ అధికారంలో ఉండాలని టీపీసీసీ మాజీ అధికార ప్రతినిధి కేవీఎన్ రెడ్డి అన్నారు. మండలంలోని కొండారెడ్డిపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన మొదటి రోజు నుంచే తెలంగాణలో అసలైన స్వేచ్ఛాయుత వాతావరణం నెలకొందన్నారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు ప్రభుత్వం ఐదు హామీలను అమలు చేసిందన్నారు. తమ గ్రామానికి చెందిన రేవంత్‌రెడ్డి సీఎం కావడంతో ఈ ప్రాంతాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు. ఎంపీగా మల్లు రవికి ప్రజలు ఓటు వేసి గెలిపించాలన్నారు. కృష్ణారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి ఉన్నారు.

15 వాహనాలు సీజ్

నాగర్‌కర్నూల్ క్రైం, ఏప్రిల్ 21 : నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న 15వాహనాలను పట్టుకుని సీజ్ చేసినట్లు జిల్లా రవాణా అధికారి చిన్నబాలు ఆదివారం తెలిపారు. కొంతమంది వాహనదారులు ఎలాంటి వాహన పత్రాలు లేకుండా వాహనాలు నడుపుతున్నారని వారిపై మోటారు రవాణా చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. తమ తనిఖీల్లో 15వాహనాలకు ఎలాంటి ఆధారిత పత్రాలు లేకపోవడంతో సీజ్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. వాహనదారులు తప్పనిసరిగా తమ వాహనాల సంబంధిత ఆధారిత పత్రాలు తమ వద్ద ఉంచుకోవాలన్నారు. ఇన్‌స్పెక్టర్ అనూప్‌రెడ్డి, రవాణా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా ప్రచారంలో బీజేపీ

ఉప్పునుంతల, ఏప్రిల్ 21: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా బీజేపీ పల్లెల్లో ఇంటింటి ప్రచారం ముమ్మరం చేసింది. నాగర్‌కర్నూల్ బీజేపీ ఎంపీ అభ్యర్థి భరత్‌ప్రసాద్‌ను గెలిపించాలని కోరుతూ ఆదివారం మండల పరిధిలోని పెనిమిళ్ల, తాడూరు కంసానిపల్లి తదితర గ్రామాల్లో జిల్లా నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు.

ఈ సందర్భంగా బీజేపీ నాయకులు ఓటర్లను కలుస్తూ భరత్ ప్రసాద్‌ను గెలిపించాలని కోరారు. జిల్లా నాయకులు శ్రీనునాయక్, సైదులుయాదవ్, బ్రహ్మచారి, గొడుగు వెంకటేష్, మహేష్ కిరణ్ సంతు తదితరులు ఉన్నారు.

● పెద్దకొత్తపల్లి: త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో నాగర్‌కర్నూల్ ఎంపీగా పోతుగంటి భరత్‌ప్రసాద్‌ను గెలిపించుకుందామని బీజేపీ రాష్ట్ర ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యులు ఇంద్రకంటి శేఖర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రమైన పెద్దకొత్తపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రతీ గడపకు ఎలాంటి అవినీతి లేకుండా చేరవేసిన వ్యక్తి ప్రధాని నరేంద్రమోదీ అని అన్నారు. నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థిగా పోతుగంటి భరత్‌ప్రసాద్‌ను అధిక మెజార్టీతో గెలిపించేందుకు అందరం కలిసికట్టుగా కృషి చేయాలని ఆయన కోరారు.

బిజినేపల్లి: మండలంలోని లట్టుపల్లి గ్రామంలో ఆదివారం బీజేపీ మండల అధ్యక్షుడు భూషయ్య ఆధ్వర్యంలో బీజేపీ బలపర్చిన ఎంపీ అభ్యర్థి పోతుగంటి భరత్‌ప్రసాద్‌కు ఓటు వేయాలని ముమ్మరంగా ప్రచారం చేపట్టారు. నాగర్‌కర్నూల్ నియోజక వర్గం నుంచి బీజేపీ అభ్యర్థిని ఎంపీగా గెలిపించుకొని నరేంద్రమోదీని మూడోసారి ప్రధానమంత్రిగా దేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించే కార్యంలో భాగస్వాములం కావాలని కోరారు.

ఆయన వెంట బీజేపీ నాయకులు కృష్ణ, శివకుమార్, ప్రవీణ్ సాగర్, అనిల్, ఉపేందర్, ధీరజ్, సాయి, శివాజీ, సుమంత్ తదితరులు ఉన్నారు.

అంబేడ్కర్ ఓటు హక్కు కల్పించడం ద్వారానే దేశంలో ప్రజాస్వామ్య విప్లవం

- దళిత సేన జాతీయ అధ్యక్షుడు బేబిరాజు

అమ్రాబాద్ ఏప్రిల్ 21: రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ ప్రజలందరికీ ఓటు హక్కు కల్పించడం ద్వారానే దేశంలో ప్రజాస్వామ్య విప్లవం సాధ్యమైందని దళిత సేన జాతీయ అధ్యక్షుడు బేబి రాజు అన్నారు. అంబేడ్కర్ యువజన సంఘం మండల శాఖ ఆధ్వర్యంలో ఆదివారం అమ్రాబాద్ మండల కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద మహనీయుల జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని ఏర్పాటు చేసిన రాజ్యాంగ పరిరక్షణ సభకు బేబి రాజు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ప్రజావాగ్గేయ కారుడు జయరాజ్, సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి, వివిధ సంఘాల నాయకులు రాములునాయక్, అరుణ, పరుశరాములు, సిద్ధార్థ మహదేవ్, అంబేడ్కర్ యువజన సంఘం మండల శాఖ అధ్యక్షుడు ఎల్లస్వామి, కళాకారులు గోపాల్, లక్ష్మీనారాయణ, రామకోటి, నాగేశ్ తదితరులు ఉన్నారు.

ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

వనపర్తి టౌన్, ఏప్రిల్ 21: అకాల వర్షాల కారణంగా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవకుండా నిర్వహకులు ముందు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా మార్కెటింగ్ అధికారి స్వరణ్‌సింగ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ధాన్యం వర్షాలకు తడవకుండా టార్పాలిన్లు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. అకాల వర్షాలు వచ్చే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ సూచనల మేరకు కొనుగోలు కేంద్రాల నిర్వాహకులతో పాటు, రైతులు సైతం అప్రమత్తంగా ఉండి ధాన్యం తడవకుండా చూసుకోవాలన్నారు. ముఖ్యంగా ఎప్పటి ధాన్యాన్ని అప్పుడే కొనుగోలు చేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని నిల్వ ఉండకుండా, కొనుగోలు చేసిన ధాన్యాన్ని తక్షణమే లారీల ద్వారా మిల్లులకు తరలించాలని పేర్కొన్నారు.